క్లుప్తంగా

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

పరిగి: తెలంగాణ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాత్ర కీలకమని కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో కొమురయ్య విగ్రహ ప్రతిష్టాపనకు సంఘం సభ్యుడు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఆయన పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆయన విగ్రహం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఇందులో సంఘం నాయకులు మల్లేశం, ఆంజనేయులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

యాలాల: చెన్నారం గ్రామానికి చెందిన బ్యాగరి హనుమప్ప అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ మల్లయ్య చేతుల మీదుగా అందజేశారు.

20న మాల మహానాడు సభ

కుల్కచర్ల: ఈ నెల 20న పరిగి పట్టణంలో మాల(ఎస్సీ) సామాజికవర్గ ప్రజలతో భారీ బహిరంగ సభ జరగనుందని మాలమహానాడు మండలం అధ్యక్షుడు తలారి విజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మాలలను చిన్నచూపుచూస్తోందని, హక్కుల సంరక్షణకు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు నాయకులు వెంకటయ్య, రాములు, యాదయ్య, లక్ష్మయ్య, వెంకటేశ్, శ్రీను, యాద య్య, నర్సింహులు, రమేష్, రాజు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత


చెరువులో చేపలను వదులుతున్న జెడ్పీటీసీ

దౌల్తాబాద్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీటీసీ కోట్ల మహిపాల్ అన్నారు. శుక్రవారం ఆయన పెద్దచెరువులో చేపపిల్లలు వదిలి మాట్లాడారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించిందని తెలిపారు. చేపలను దూరప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించుకునేందుకు ప్రభుత్వం మోటార్ సైకిళ్లను ఉచితంగా అందజేస్తుందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధిచేకూరుతుందని పేర్కొన్నారు. ఇందులో మత్స్యశాఖ ఏడీ చరితారెడ్డి, సంఘం అధ్యక్షుడు సభ్యులు ఉన్నారు.

క్రీడా ప్రాంగణాలకు కిట్ల పంపిణీ


కిట్లను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

దోమ: చదువుతో పాటు క్రీడలపై యువత మక్కువ చూపాలని ఎంపీపీ, జెడ్పీటీసీ నాగిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పలువురు సర్పంచులకు క్రీడా కిట్లను ఎంపీడీఓ జయరాంతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆటల్లో ప్రోత్సహించేందుకే ప్రభుత్వం క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసిందని, అందులో భాగంగానే ఈ కిట్లను అందజేస్తుందని పేర్కొన్నారు. ఇందులో వైస్ ఎంపీపీ మల్లేశం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

విజేతలను అభినందించిన ప్రిన్సిపాల్

కొడంగల్ రూరల్: గురుకుల అండర్ 19 విభాగంలో జరిగిన క్రీడా పోటీల్లో కొడంగల్ కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి పొందారని ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ నెల 1నుంచి 4 వరకు రంగారెడ్డి జిల్లా బోగారం, కీసరగుట్ట కళాశాలల్లో జరిగిన అండర్ 19 టోర్నీలో ఉమ్మడి జిల్లాలోని బీసీ గురుకుల కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఇందులో కొడంగల్ విద్యార్థులు కబడ్డీ, పరుగుపందెం, హై జంప్, లాంగ్ జంప్, ఖోఖో, చదరంగం, క్యారమ్స్, షాట్‌పుట్ డిస్కస్ త్రో, వంద, 250, 400, 800, 16వందల మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతులు సాధించారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. శుక్రవారం విజేతలను ప్రిన్సిపాల్, ఏటీపీ సంధ్య, అనంతరాములు, పీఈటీ సురేష్, నెహ్రూనాయక్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపు

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో దసరా ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. గత ఏడాది పారిశుద్ధ్య విభాగంలో తాత్కాలిక పద్ధతిన తీసుకున్న 10 మంది కార్మికుల వేతనాల చెల్లింపు, వార్డుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పనులకు నిధులు కేటాయిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఇందులో కమిషనర్ జాకీర్ అహ్మద్, వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం ఉన్నారు.

తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత

- ఆగని అక్రమ రవాణా
- యథేచ్ఛగా కొనసాగుతున్న ఇసుక దందా
- దళారులకు అడ్డాగా మంబాపూర్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- అటకెక్కిన సర్కారు ధర.. సామాన్యుడికి భారంగా మారిన వైనం


ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

పెద్దేముల్: ప్రతి ఒక్కరికి అందుబాటులో ఇసుక ధర ఉండాలన్న లక్ష్యంతో కలెక్టర్ నారాయణరెడ్డి ట్రాక్టర్ ఇసుకకు రూ.600లకు నిర్ణయించారు. కానీ దళారుల అక్రమ దందాతో.. ఇసుక సామాన్యుడికి భారంగా మారింది. తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత అన్నట్లుగా అక్రమార్కులు తెగించారు. యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని, అక్రమార్కులకు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతోనే వారు బరితెగించి పోతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉండి.. చిన్నపాటి ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.వేలు, లక్షలు వెచ్చించి ఇసుకను విక్రయించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినా..

పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, రుక్మాపూర్, కొండాపూర్, యాలాల మండల బిజ్వారం వాగుల నుంచి ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమ ఇసుక, నకిలీ విత్తనాలకు అరికట్టాలని ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. అయినా అక్రమ దందాకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఏడాది క్రితం ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతులు ఇవ్వాలని సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి విన్నవించారు. అయినా ఫలితం లేదు. కలెక్టర్.. ట్రాక్టర్ ఇసుకకు రూ.600చెల్లించి, రెవెన్యూ కార్యాలయం నుంచి అనుమతి తీసుకొని తీసుకెళ్లాలని చెప్పినా.. అందుకు విరుద్ధంగా ఇసుక తరలింపు జరుగుతోందని పరిసర ప్రాంత ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

కర్ణాటకకు తరలింపు..

పెద్దేముల్-యాలాల మండలాల మధ్య ఉన్న బిజ్వారం వాగు నుంచి అక్రమ ఇసుకను కర్ణాటక సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. మన్‌సాన్‌పల్లి వాగు నుంచి ధారూర్‌తో పాటు పెద్దేముల్ మండలం మారేపల్లితండా మీదుగా కోటపల్లి, బంట్వారం మండలాలకు తీసుకెళ్తున్నారు. ట్రాక్టర్ ఇసుకకు దగ్గరలో ఉంటే రూ.4వేల నుంచి రూ.6వేలకు ధర నిర్ణయించి విక్రయిస్తున్నట్లు సమాచారం.

పొలాల్లో గుడారం..

అక్రమ వ్యాపారులకు మంబాపూర్ అడ్డాగా మారింది. మన్‌సాన్‌పల్లి, బిజ్వారం, రెగోండి గ్రామాల నుంచి వచ్చే ఇసుక ట్రాక్టర్లు మంబాపూర్ మీదుగా.. అధికంగా కుంచారం, బండమీదిపల్లి, తొరమామిడి, కోటపల్లి, బార్వాద్‌తో పాటు పలు గ్రామాలకు వెళ్తుంటాయి. కాగా పరివాహక ప్రాంతంగా ఉన్న మదనంతాపూర్, రేగొండి, రుక్మాపూర్, ఖాంజాపూర్, కందనెల్లి ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వాగుల సమీపంలోని పొలాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని దందా చేస్తున్నట్లు తెలుస్తోంది.

నిఘా పెంచుతాం..



మండలంలో అక్రమ ఇసుక ఎక్కడ నిల్వలు ఉన్నా.. అనుమతులు లేకుండా తరలించినా చర్యలు తీసుకుంటాం. మన్‌సాన్‌పల్లి, రక్మాపూర్ ప్రాంతాల నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం ఉంది. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. వాహనాలను సీజ్ చేస్తాం.

– కిషన్, తహసీల్దార్, పెద్దేముల్

ప్రైవేటుకు దీటుగా.. సర్కారు బడి

- నాణ్యమైన భోజనంతో పాటు విద్య అందిస్తున్న ప్రభుత్వం
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు రూరల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి గౌతపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో 'ముఖ్యమంత్రి ఉపాహారం పథకం'ను సర్పంచ్ రాజప్పతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అందిస్తోందని పేర్కొన్నారు. ఉపహారం విద్యార్థుల డ్రాపౌట్‌ను తగ్గిస్తుందని తెలిపారు. డీఈఓ రేణుకదేవి, ఎంపీపీ అనితగౌడ్, జెడ్పీటీసీ మంజుల, ఎంఈఓ వెంకటయ్య, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ రాజప్పగౌడ్ ఉన్నారు.


విద్యార్థికి ఉపాహారం తినిపిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి

పరిగి ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

పూడూరు: విద్యావ్యవస్థ ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. పూడూరు మండలం మన్నెగూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాహారం పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి సమయానుకూలంగా ఆహారం వడ్డించడంతో పాటు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, ఎంఈఓ హరిశ్చందర్, ఎంపీటీసీ మస్రత్ ఆదిల్, వినోద్ గౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఉపాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండి

బషీరాబాద్: గ్రామాభివృద్ధికి జెడ్పీ నిధులు కేటాయించాలని కాశీంపూర్ సర్పంచ్ వెంకటయ్య జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడారు. గ్రామంలో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి మరిన్ని నిధులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ద్వారా ఐదుగురుకి దళితబంధు మంజూరు అయినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. చైర్‌పర్సన్‌ను కలిసిన వారిలో నర్సింహులు, బాలకృష్ణ, వెంకట్‌రెడ్డి, ఎల్లప్ప, శరత్‌కుమార్, వెంకటయ్య, వెంకటప్ప, సూరప్ప ఉన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

గ్రామాభివృద్ధే ధ్యేయం

దోమ: గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని వైస్ ఎంపీపీ మల్లేశం అన్నారు. శుక్రవారం దోమ మండలం మోత్కుర్‌లో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ కేశవులుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో పంచాయతీ భవనాలు లేని ఊర్లను గుర్తించి, ఒక్కో జీపీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసిందని, అందులో భాగంగానే మోత్కుర్‌లో భూమిపూజ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రావు, పంచాయతీ కార్యదర్శి రాములు, వార్డు సభ్యులు బాల్‌రాజ్, చందు, వెంకటయ్య, హన్మంతు, శివయ్య, నర్సింహులు, యశోద, పావని, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోపాల్, గ్రామ అధ్యక్షుడు మల్లేశం, గ్రామస్తులు శివానంద్, శశిధర్ రెడ్డి, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు


పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పరిగి: రైతులు.. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తపనిసరిగా పాటించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కోఆర్డినేటర్ లక్ష్మణ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం తాండూరు శాస్త్రవేత్తలు శుక్రవారం మాధారం గ్రామంలో పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. సాంప్రదాయ పద్ధతిలో పండించే పంటలు అధిక దిగుబడితో పాటు తక్కువ కాలంలో చేతికి వస్తాయని పేర్కొన్నారు. రైతులు పంట సాగు చేసేటప్పుడు సాళ్ల మధ్య ఎక్కువ మొక్కలు ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని తగిన సూచలు చేశారు. పంటలను పరిశీలించి దిగుబడిని అంచనా వేశారు. ఇందులో శాస్త్రవేత్తలు యమున, భాను, వెంకటేశ్, మధు ఉన్నారు.

కొలువుల సంబురం

పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన యువతీ యువకులను సన్మానించిన నేతలు


దోమ: అభ్యర్థులను సన్మానిస్తున్న సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి


కొడంగల్ రూరల్: అభ్యర్థులను అభినందిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు

బొంరాస్‌పేట: పోలీసు కొలువు సాధించిన యువతీ యువకులు పట్టరాని సంతోషంతో మిఠాయిలు పంచిపెట్టారు. బొంరాస్‌పేట మండల పరిధి గ్రామాలు, తండాలకు చెందిన పలువురు ఆర్మీ, పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బురాన్‌పూర్, మెట్లకుంట, గ్రామాలు, తండాలతో పాటు భీక్యానాయక్‌తండాకు చెందిన శివ పోలీసు కానిస్టేబుల్, విజయ్‌గణేశ్ ఆర్మీకి ఎంపికయ్యారు. వీరికి పూర్వ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య అభినందనలు తెలిపారు.

అభినందనలు..

కొడంగల్ రూరల్: పోలీసు ఉద్యోగాలకు ఎంపికయిన అభ్యర్థులను రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్ఎస్ఎస్) సంఘం నాయకులు అభినందించారు. ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ అక్షయ్‌కుమార్, జగదీష్, జెఎల్ఎంగా మున్నూర్ వెంకటయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. విధి నిర్వహణలో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అలాగే మండల పరిధి హస్నాబాద్‌కు చెందిన చంద్రశేఖర్ పోలీసు ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇందులో ఖండ సంఘచాలక్ మల్లయ్య, భీమాశంకర్, రాధేశ్యామ్, కిషోర్, వెంకట్‌రావు, మహేశ్, రతన్‌లాల్, రఘుపతి ఉన్నారు.

పోలీసు ఉద్యోగాలకు యువకుల ఎంపిక

దౌల్తాబాద్: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు, నందారం గ్రామానికి చెందిన ఓ యువకుడు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మారుమూల ప్రాంతమైన దౌల్తాబాద్, నందారం గ్రామాలకు చెందిన అశోక్, ప్రభాకర్‌గౌడ్, తుల్జప్పలు ఎంపికైన వారిలో ఉన్నారు. కాగా తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో ముగ్గురు యువకులు పోలీసు కొలువుకు ఎంపికయ్యారు. దీంతో ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

బాధ్యతగా భావించాలి

దోమ: ఉద్యోగాన్ని బాధ్యతగా భావించి భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం పంచాయతీ ఆవరణలో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన జితేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, మహేశ్, ప్రవీణ్‌లకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఇందులో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ రాజగోపాల చారి, ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్, వార్డు సభ్యులు వసంతరావు, లక్ష్మణ్, సాయిలు, రవికుమార్, వెంకట్‌రాములు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు పరాభవం తప్పదు

- కేసీఆర్ పాలనపై విసుగుచెందిన ప్రజలు
- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- పక్కాగా ఆరు గ్యారంటీ పథకాలు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నేతలు


మర్పల్లి: వీర్లపల్లిలో గ్యారంటీ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మర్పల్లి/మోమిన్‌పేట/బషీరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, సీఎం కేసీఆర్ ప్రజావ్యతిరేక పాలనతో విసుచెందుతున్నారని, రానున్న ఎన్నికల్లో వారికి పరాభవం తప్పదని కాంగ్రెస్ పార్టీ నేతలు అన్నారు. శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ గ్యారంటీ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. మర్పల్లి మండలం బూచన్‌పల్లి, వీర్లపల్లిలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి రాగానే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి కుటుంబానికి నెలకు రూ.2,500 నగదు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామని పేర్కొన్నారు. రైతులకు యేటా పెట్టుబడి సాయం ఎకరాకు రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను రూ.2 లక్షలను ఏకకాలంలో మాఫీ చేస్తామని వెల్లడించారు. ఇంటింటికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, ఆసరా పింఛన్లు రూ.3 వేలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయి పటేల్, వెంకట్‌రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, బక్కారెడ్డి, బలవంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెంకట్, పాండురంగారెడ్డి ఉన్నారు.

మోమిన్‌పేటలో..

గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను తీసుకెళ్తున్నట్లు ఆ పార్టీ మోమిన్‌పేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజొద్దీన్ చెప్పారు. మోమిన్‌పేటలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఇందులో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాగ్దాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాజ్ పటేల్, మండల ఉపాధ్యక్షుడు హాజీ, నాయకులు వాజిద్, తాజ్, ఖలీల్, మోసిన్, తౌఫిక్ ఉన్నారు.

బషీరాబాద్‌లో..

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో పరాభవం తప్పదని కాంగ్రెస్ పార్టీ బషీరాబాద్ మండలం అధ్యక్షుడు కలాల్ నర్సింహులు అన్నారు. బోజ్యానాక్‌తండాలో గ్రామకమిటీని ఆయన నియమించారు. బోజ్యానాయక్‌తండా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బద్రుశంకర్ నాయక్, ఉపాధ్యక్షుడిగా సూర్యను ఎన్నుకున్నారు. ఇందులో మోహన్, గోపాల్, రామునాయక్, కిషన్ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడంగల్ రూరల్: పట్టణ శివారు బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం పలువురు భక్తులు తమ వంతు సహకారం అందజేశారు. విశ్రాంత సైనికుడు నర్సాపురం రాములు రూ.11,111, శశికళ రూ.21,116లను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు ఉమాపతి, కానుకుర్తి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఇమామ్‌లు ఐడీలు తీసుకోవాలి

కొడంగల్ రూరల్: మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్‌లు శనివారం ఉదయం 10గంటల నుంచి హైదరాబాద్ నాంపల్లిలోని హజ్‌హౌజ్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలని మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం.గౌసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇమామ్‌లు తమ ఆధార్‌కార్డు, మసీద్ మేనేజింగ్ కమిటీ లెటర్, బ్యాంకు ఖాతా వివరాలు తీసుకొని కార్యాలయానికి వెళితే.. అక్కడ ఐడీ కార్డులు జారీ చేస్తారని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారితో పాటు కొత్తవారు అర్జీ పెట్టుకోవాలన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రం 2వ వార్డులో సీసీరోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేక నిధులతో పట్టణ సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇందులో కౌన్సిలర్ అర్చన, నాయకులు రవికుమార్ కాలనీ వాసులు ఉన్నారు.

భూ పరిహారం ఇవ్వాలి

అనంతగిరి: మోమిన్‌పేట మండలం ఎన్కతల గ్రామంలో చేపట్టిన భూ సేకరణలో నష్టపరిహారం అందని రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఎన్కతల గ్రామ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని టీఎస్ఐఐసీ ఉన్నతాధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఆడపడుచులకు కానుక


కొడంగల్ రూరల్: మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అనిత


దౌల్తాబాద్: చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

దౌల్తాబాద్: బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడపడుచులకు కానుకగా ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తుందని సర్పంచ్ శిరీష అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్‌లో మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఎంతో గౌరవం ఇస్తుందని పేర్కొన్నారు. ఇందులో డీలర్లు హన్మిరెడ్డి, యశోద ఉన్నారు.

పండుగలు ప్రశాంతంగా..

బంట్వారం: కుల మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన జెడ్పీటీసీ సంతోషతో కలిసి జీపీల వారీగా పంచాయతీ కార్యర్శులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలందరికీ బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం క్రీడా ప్రాంగణాలకు కిట్లను అందజేశారు. జెడ్పీటీసీ సంతోష, ఎంపీడీఓ బాలయ్య, జేఏ షఫీ ఉన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు క్రీడా పరికరాలను సర్పంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొద్ది రోజుల్లో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తుందన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తాండూరు రూరల్: మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్‌ను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు, గౌతపూర్ ఎంపీటీసీ నరేందర్ రెడ్డి శుక్రవారం సన్మానించారు. ఇందులో ఎంపీపీ అనితగౌడ్, జెడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూపరెడ్డి, నాయకులు ప్రవీణ్‌గౌడ్, భీంరెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.


ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చైర్‌పర్సన్‌లకు హైకోర్టులో చుక్కెదురు

అవిశ్వాస తీర్మానం పిటిషన్ల కొట్టివేత

తాండూరు: జిల్లాలోని ఇద్దరు మున్సిపల్ చైర్‌పర్సన్‌లకు హైకోర్టులో చుక్కెదురైంది. 6 నెలల క్రితం తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులపై విపక్ష పార్టీల కౌన్సిలర్ల మద్దతుతో సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు. ఈ విషయంలో ఇద్దరు చైర్‌పర్సన్‌లు హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. దీంతో కోర్టులో వారికి స్టే రూపంలో అప్పట్లో ఊరట లభించింది. శుక్రవారం మరోసారి హైకోర్టులో అవిశ్వాస తీర్మానంపై వాదనలు జరిగాయి. సెక్షన్ 299, సెక్షన్ 299(ఏ) ఏపీ మున్సిపల్ చట్టం 1965 ప్రకారం ఉన్న నిబంధనలు రద్దయ్యాయి. 2018 కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం నిబంధనలు కొనసాగుతాయని న్యాయవాది వాదనలు వినిపించగా.. వాదనలు విన్న న్యాయమూర్తి.. మున్సిపల్ చైర్మన్‌లు, చైర్‌పర్సన్‌ల పిటిషన్లను కొట్టి వేస్తూ తీర్పు చెప్పారు. దీంతో మరోసారి రెండు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానం అంశం తెరపైకి వచ్చింది. ఇద్దరు చైర్‌పర్సన్లకు అసెంబ్లీ ఎన్నికల వేళ పదవి గండం పొంచి ఉంది.